క్లుప్తంగా

రేపటి కంటి వెలుగుకు సర్వం సిద్ధం

అంబర్‌పేట: కంటి వెలుగు కార్యక్రమానికి అధికారులు ఏర్పాట్లను పూర్తి చేశారు. నియోజకవర్గంలో పూర్తి స్థాయిలో కేంద్రాలను ఎంపిక చేశారు. మొత్తంగా 6 కేంద్రాల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 వరకు కంటిపరీక్షలు నిర్వహిస్తారని జూన్ 30 వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని సమాచారం. కేంద్రాల వద్ద అన్ని ఏర్పాట్లను పూర్తి చేశామని జీహెచ్‌ఎంసీ సర్కిల్–16 డీఎంసీ వేణుగోపాల్ తెలిపారు.

కార్పొరేటర్ పర్యటన



స్థానికులతో కార్పొరేటర్ ఉమా రమేష్‌యాదవ్

కాచిగూడ: శివాజీనగర్ బస్తీలో మార్కెట్ వద్ద మెయిన్ రోడ్డుపై తాగునీటి పైపులైన్ పగిలి నల్లాలోని నీరు కలుషితమై రోడ్లపై తాగునీరు వృధాగా పోతోందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమారమేష్‌యాదవ్ శివాజీనగర్ బస్తీలో పర్యటించి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నీటి వృధాను అరికట్టాలని ఈ సందర్భంగా జలమండలి అధికారులకు సూచించారు. బీజేపీ నేతలు అశోక్, సతీష్, మల్లికార్జున్, భీమ్‌రాజ్, నాగు, ఆర్.సంతోష్, ఎస్.రవియాదవ్, దినేష్ తదితరులున్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

కాచిగూడ: గోల్నాక డివిజన్ నెహ్రూనగర్ బస్తీలో గత కొంత కాలంగా డ్రైనేజీ మరమ్మతులు, రోడ్డు పనులు పూర్తికాకపోవడంతో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ స్పందించి పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఆయన ఆదేశాల మేరకు మంగళవారం బీఆర్ఎస్ నేతలు రామకృష్ణ, సంతోష్‌కుమార్‌లు, జీహెచ్‌ఎంసీ సిబ్బంది, కాంట్రాక్టర్‌తో కలిసి రోడ్డు పనులను పరిశీలించారు. రోడ్డు పనులను త్వరగా పూర్తిచేసి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని వారు కోరారు.

కొత్త మ్యాన్‌హోల్స్ ఏర్పాటు

చిక్కడపల్లి: గాంధీనగర్ డివిజన్‌లోని హరిత అపార్ట్‌మెంట్ పరిసర ప్రాంతాల్లో దెబ్బతిన్న డ్రైనేజీ, తాగునీటి, కచ్చామోరీ పైప్‌లైన్ల మ్యాన్‌హోల్స్ స్థానంలో కొత్త వాటిని సిబ్బందితో ఏర్పాటు చేయిస్తున్నామన్నారు. బీఆర్ఎస్ నాయకులు శ్రీకాంత్, సత్యనారాయణ, శ్రీనివాస్‌గుప్తా తదితరులున్నారు.

భార్యపై దాడి చేసిన వ్యక్తికి 5 రోజుల జైలు

చిక్కడపల్లి: భార్యపై చేయిచేసుకున్న ఘటనలో భర్తకు 5రోజులు జైలుశిక్ష పడింది. ఈ ఘటన చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ సంజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. బాగ్‌లింగంపల్లి పాలమూరు బస్తీకి చెందిన ఆటో డ్రైవర్ సాజిద్ అన్వర్ (30) మద్యం మత్తులో భార్యపై దాడికి పాల్పడటంతో పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. దీంతో అతడిపై పోలీసులు పెట్టీ కేసు నమోదు చేయగా.. 5వ స్పెషల్ ఎంఎం కోర్టు ఐదు రోజుల సాధారణ జైలు శిక్షను న్యాయమూర్తి విధించారని పోలీసులు తెలిపారు.

బీసీ రిజర్వేషన్ల బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలి

లిబర్టీ: చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలని బీసీ దళ్ జాతీయ అధ్యక్షుడు కుమారస్వామి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన బీసీ దళ్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లును ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలని అనేక సంవత్సరాలుగా పోరాటం చేస్తున్నప్పటికీ ఏ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఎనిమిదేళ్లుగా అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం బీసీల పట్ల తీవ్ర నిర్లక్ష్య వైఖరితో వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఈ నెల 31వ తేదీ నుంచి పార్లమెంట్ సమావేశాలు ప్రారంభమవుతున్న క్రమంలో బీసీ బిల్లును ప్రవేశపెట్టి బీజేపీ ప్రభుత్వం తమ చిత్తశుద్ధిని బీసీల పట్ల ఉన్న ప్రేమను నిరూపించుకోవాలన్నారు.

ఓయూ పాలన పదవుల్లో ప్రొ.అన్సారీపై వివక్ష తగదు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పాలన పదవుల్లో ప్రొ.అన్సారీపై వివక్ష తగదని బీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు సంజయ్ పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన అన్సారీని పాలన పదవులకు దూరంగా ఉంచి అనుభవం లేని అసిస్టెంట్ ప్రొఫెసర్లు, జూనియర్లను ఉన్నత పదవుల్లో నియమించడం అన్యాయమన్నారు. గతంలో జరిగిన విషయాలను దృష్టిలో ఉంచుకొని అవమానపర్చడం దారుణమన్నారు. ఓయూలో ముస్లిం మైనార్టీలకు ముఖ్యమైన పదవుల్లో నియమించకపోవడం విచారకరమన్నారు. విజ్ఞానాన్ని అందించే వర్సిటీల్లో అధ్యాపకుల నడుమ పగలు, ప్రతీకారాలు, కక్షలకు తావు ఉండకూడదన్నారు. ప్రస్తుతం ఓయూలో ఉన్న అధ్యాపకుల్లో ప్రొ.అన్సారీ సీనియర్ కావడంతో ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపల్‌గా అవకాశం కల్పించాలని వీసీ ప్రొ.రవీందర్‌ను కోరారు.

40వ రూట్ ఆర్టీసీ బస్సులను పునరుద్ధరించాలి



ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్‌తో ఆర్టీసీ అధికారులు

ముషీరాబాద్: సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ నుంచి కోఠికి వయా అశోక్‌నగర్ చౌరస్తా మీదుగా వెళ్లే 40వ నంబరు రూట్ ఆర్టీసీ బస్సును వెంటనే పునరుద్ధరించాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ ఆర్టీసీ అధికారులకు సూచించారు. అశోక్‌నగర్ చౌరస్తా, గాంధీనగర్ తదితర ప్రాంతాల్లో గత కొంత కాలంగా రోడ్డు మరమ్మతులతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుందని ఈ రూటును ఆర్టీసీ క్రాస్ రోడ్స్, చిక్కడపల్లి, నారాయణగూడ మీదుగా మళ్లించారు. దీంతో అశోక్‌నగర్ తదితర ప్రాంత ప్రజలు నగరంలోని వివిధ ప్రాంతాలకు వెళ్లాలంటే ఈ 40వ రూట్ బస్సు అందుబాటులో లేకపోవడంతో ఆటోలను ఆశ్రయించాల్సిన వస్తోందని ప్రజలు వాపోతున్నారు. దీనిపై ఎమ్మెల్యేను కలిసి వారు పరిస్థితిని వివరించగా.. ఆయన ముషీరాబాద్ డిపో మేనేజర్ కిషన్‌రావు, అసిస్టెంట్ మేనేజర్ (ట్రాఫిక్) కల్యాణి ఆర్టీసీ సిబ్బందితో సమావేశమై పరిస్థితిని వివరించారు. ఈ సమావేశంలో వారు ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉందని చెప్పడంతో ఆయన అడిషనల్ ట్రాఫిక్ కమిషనర్ సుధీర్‌బాబును ఫోన్‌లో సంప్రదించారు. గతంలో మాదిరిగానే 40వ నెంబర్ రూట్‌లో ఆర్టీసీ బస్సులను పునరుద్ధరించడంతో పాటు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాలని కోరారు.

ఘనంగా రోహిత్ వేముల వర్ధంతి



మాట్లాడుతున్న రిటైర్డ్ ఐఏఎస్ ఆకునూరి మురళి

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: కేవీపీఎస్ ఆధ్వర్యంలో రోహిత్ వేముల 7వ వర్ధంతి సభను సుందరయ్య విజ్ఞానకేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌బాబు, నాయకులు సాగర్, బొజ్జబిక్షమయ్య, శంకర్, ప్రసాద్, మహేశ్వర్, సుబ్బారావు, కృపాసాగర్, ఇందిరా, ఉమా, రాణాప్రతాప్, వెంకన్న తదితరులున్నారు.

రోహిత్ వేముల ఆశయ సాధనకు కృషి ..

కవాడిగూడ: అంబేడ్కర్ ఆలోచన విధానం స్వేచ్ఛా సమానత్వం, సౌభ్రాతృత్వం కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని దళిత బహుజన పార్టీ జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు వడ్లమూరి కృష్ణస్వరూప్ పిలుపునిచ్చారు. హెచ్‌సీయూ రీసెర్చ్ స్కాలర్ రోహిత్ వేముల 7వ వర్ధంతి సందర్భంగా మంగళవారం లోయర్‌ట్యాంక్‌బండ్‌లోని డాక్టర్ బీ.ఆర్ అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించిన అనంతరం రోహిత్ వేముల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు సుబ్బారావు, డీబీఎస్ఎఫ్ తెలంగాణ రాష్ట్ర కో– ఆర్డినేటర్ గణేష్, మాలమహానాడు జాతీయ ఉపాధ్యక్షుడు భాస్కర్‌రావు, పార్టీ నాయకులు రాజు, పాండు, కరుణాకర్ తదితరులున్నారు.

'పనిగట్టుకుని మూక దాడులు'..

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: 'తెలంగాణలో మనువాద భావజాలనికి అడ్డుగా ఉన్న వారిపై పనిగట్టుకుని మూకదాడులు చేస్తున్నారని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి' ఆరోపించారు. మంగళవారం సుందరయ్యవిజ్ఞానకేంద్రంలో కుల అసమానతల నిర్మూలనల పోరాట సమితి, తెలంగాణ సామాజిక ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో రోహిత్ వేముల 7వ వర్ధంతి సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హెచ్‌సీయూలో రోహిత్‌ను వ్యవస్థీకృత హత్యకు గురిచేశారన్నారు. ప్రముఖ అంబేడ్కర్ వాది జేబీరాజు, కుల అసమానతల నిర్మూలన పోరాట సమితి అధ్యక్షుడు బండారి లక్ష్మయ్య, ప్రొఫెసర్ రత్నం, సరోజన, నరేష్, సదానందం తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక పూజలు



కవాడిగూడ: దోమలగూడ హనుమాన్ దేవాలయంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మంగళవారం బీజేపీ ఓబీసీ మోర్చా నగర అధ్యక్షుడు సలంద్రి శ్రీనివాస్‌యాదవ్, బీజేపీ రాష్ట్ర నాయకులు వెంకటేష్, శ్రీను, ఆలయ అర్చకులు శేషాచలం, మహేందర్, ప్రభ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

దాడి చేసిన వారిని శిక్షించాలి

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: నిజామాబాద్ జిల్లా కోటగిరి హైస్కూల్ ఉపాధ్యాయుడు మల్లికార్జున్‌పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. మంగళవారం సుందరయ్యవిజ్ఞానకేంద్రంలో ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్‌పీసీ) ఆధ్వర్యంలో ఈ దాడిని ఖండిస్తూ రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి, ప్రొఫెసర్ కాశీం, ప్రజాకవి జయరాజు, టీఎస్‌యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి రవి, వివిధ సంఘాల నాయకులు అభినవ్, రమేష్, శంకర్, జనార్దన్, హన్మేష్, వేంకటేశ్వర్‌రావు, ఝాన్సీ, వేణుగోపాల్, శ్రీనివాస్, సాంబశివరావు, జీవన్‌కుమార్, ప్రసాద్, సాగర్ తదితరులు పాల్గొని ప్రసంగించారు.

'బీఆర్ఎస్ సభను విజయవంతం చేయండి'

లిబర్టీ: ఖమ్మంలో ఈనెల 18న జరుగనున్న భారత రాష్ట్ర సమితి ఆవిర్భావ బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెన్న సదానందం పార్టీ శ్రేణులకు విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ, బీఆర్ఎస్ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు అధ్యక్షతన నిర్వహించే ఈ కార్యక్రమానికి హైదరాబాద్ నుంచి వేలాది మంది ప్రదర్శనగా తరలివెళ్లి సభలో పాల్గొంటామన్నారు. కేరళ, ఢిల్లీ, పంజాబ్, బీహార్, ముఖ్యమంత్రులు, సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారం ఏచూరి తదితరులు పాల్గొనే ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో పార్టీ కార్యకర్తలు, ప్రజలు పాల్గొనాలని సదానందం కోరారు.

అగ్నిప్రమాదం.. గిఫ్ట్ షాప్ దగ్ధం

హిమాయత్‌నగర్: విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో దాదాపు రూ.2 లక్షల ఆస్తినష్టం జరిగినట్టు తెలిసింది. సోమవారం అర్ధరాత్రి నారాయణగూడ పోలీసు స్టేషన్ పరిధిలో ఈ ప్రమాదం జరిగింది. వివరాలు... దోమలగూడలో నివాసం ఉండే లక్ష్మణ్‌లాల్ గత పదేళ్లుగా హిమాయత్‌నగర్ వైజంక్షన్ సమీపంలోని టీబీఎస్ షోరూం వద్ద ఉన్న ఫుట్‌పాత్‌పై గిఫ్ట్ షాప్ నెలకొల్పి సీజనల్ పండుగలకు సంబంధించిన పలు రకాల వస్తువులను విక్రయిస్తున్నాడు. సోమవారం అర్ధరాత్రి దాటక దట్టమైన పొగలు వ్యాపించి మంటలు మొదలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి అగ్నిమాపక అధికారులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి మంటలను అదుపు చేశారు. అప్పటికే లోపల ఉన్న సుమారు రూ.2 లక్షల విలువ చేసే వస్తువులు కాలి బూడిదైనట్టు ఇన్‌స్పెక్టర్ రాపోలు శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల ఈ ప్రమాదం జరిగి ఉండవచ్చని అగ్నిమాపక అధికారులు తెలిపారు.



కాలి బూడిదైన గిఫ్ట్ షాప్

అనాథ పిల్లలకు చేయూతనివ్వాలి



బీజేవైఎం నాయకుడు మద్దూరి శివాజీ తదితరులు

ముషీరాబాద్: అనాథ పిల్లలను చేరదీసి వారికి విద్యాబుద్ధులు అందించి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని బీజేవైఎం మహంకాళి జిల్లా అధ్యక్షుడు మద్దూరి శివాజీ అన్నారు. ముషీరాబాద్‌లోని రెయిన్‌బో హోమ్ అనాథాశ్రమంలో మంగళవారం సంక్రాంతి పండగ సందర్భంగా బీజేవైఎం కమిటీ ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలతో కలిసి పతంగులు ఎగురవేయడంతో పాటు వారికి ఆహారం, స్వీట్లు పంచి పెట్టారు. బీజేవైఎం ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతూ.. పేదల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అనాథలకు ప్రత్యేక హాస్టళ్లను నిర్మించి వసతి, విద్యాబోధన అందించాలన్నారు. బీజేవైఎం నగర అధికార ప్రతినిధి రాజ్‌కుమార్, రాష్ట్ర మీడియా కన్వీనర్ రాజు, ముషీరాబాద్ బీజేవైఎం అధ్యక్ష కార్యదర్శులు ఆయూష్, సాయియాదవ్, నాయకులు ఉదయ్‌కిరణ్, వంశీ తదితరులున్నారు.

ఆకట్టుకున్న అన్నమయ్య పద సుమార్చన

చిక్కడపల్లి: అన్నమయ్య పద సుమార్చనం–16 పేరిట నిర్వహించిన కార్యక్రమం ఆకట్టుకుందని ప్రముఖ సంగీత దర్శకులు డాక్టర్ రాజశేఖర శర్మ, కర్ణాటక లలిత సంగీత గాయకులు ప్రభాకర్ అన్నారు. మంగళవారం రాత్రి చిక్కడపల్లి త్యాగరాయగానసభలో అన్నమయ్య కళాసమితి ఆధ్వర్యంలో లిటిల్‌బాయ్, ఆఫ్ ది ఇయర్– 2023 వండర్ బుక్ ఆఫ్ రికార్డ్ అన్నమయ్య పద సుమార్చనం–16 కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా 30 మంది చిన్నారులు, 30 నిముషాల్లో 30 వైవిద్య రాగాలలో కేవలం దేశీయ చిన్నారులే కాకుండా విదేశీయులు కూడా అద్భుతంగా పాడి అలరించారు. అన్నమయ్య కళా సమితి నకిరేకల్ ఆధ్వర్యంలో గానసభ ప్రేక్షకులను ఆకట్టుకుందన్నారు.

- అన్నమయ్య కళాసమితి నిర్వాహకురాలు సుమలతకు లిటిల్‌బాయ్ ఆఫ్ ది ఇయర్–2023 వండర్ బుక్ ఆఫ్ రికార్డ్‌ను అందజేసి సన్మానించారు. సంగీత ప్రముఖులు డాక్టర్ పురుషోత్తమాచార్యులు, వేణుగోపాల్‌రావు, సంధ్య, సుబ్రమణ్యం, సంగీత దర్శకులు రవివర్మ, న్యాయవాది మురళీధర్‌రావు, పద్మ, శ్యామసుందర్, మల్లిక ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఇండియా, చీఫ్ కో– ఆర్డినేటర్ డాక్టర్ నరేందర్‌గౌడ్, కార్యక్రమ నిర్వాహకురాలు మాయూరిరాధ, వేణుగోపాల్‌రావు, సంధ్య, లక్ష్మి, మురళిధర్‌రావు పాల్గొన్నారు.



నిరుద్యోగులను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దాలి

రాంగోపాల్‌పేట్: నిరుద్యోగులకు వ్యాపారాల్లో శిక్షణ అందించి పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ బ్రాంచ్ ఏజీఎం శ్రీనివాస్ అన్నారు. భారతీయ యువ ట్రస్టు త్రైమాసిక సదస్సును మంగళవారం హోటల్ పార్క్‌లేన్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడారు. భారతీయ యువ ట్రస్టు గత 30 ఏళ్లలో ఎంతో మంది యువ పారిశ్రామిక వేత్తలను తయారు చేసిందన్నారు. ప్రస్తుత సమాజంలో ఎంతో మంది యువతకు వ్యాపారం ఆసక్తి ఉన్నా ఏ వ్యాపారం, ఎలా ప్రారంభించాలి, ప్రాజెక్టు రిపోర్టు ఎలా తయారు చేయాలి, రుణాలు ఎలా పొందాలి, ఉత్పత్తిని ఎలా మార్కెట్ చేసుకోవాలనే అంశాలపై అవగాహన లేదన్నారు. ఇలాంటి వారికి మార్గదర్శనం చేసేందుకు భారతీయ యువశక్తి ట్రస్టు ముందుకు రావడం ఎంతో అభినందనీయమన్నారు. ఇంకా వేలాది మంది యువత ఇలాంటి సందిగ్ధంలోనే ఉన్నారని అలాంటి వారికి సరైన శిక్షణ ఇచ్చి యువ పారిశ్రామికవేత్తలుగా తయారు చేయాలన్నారు. లాభదాయంగా ఉండే వ్యాపారాలకు బ్యాంకులు కూడా రుణాలు ఇచ్చేందుకు ముందుకు వస్తాయని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా కొన్ని వర్గాలు, వ్యాపారాలకు సబ్సిడీలు అందిస్తున్నాయని వివరించారు. ట్రస్టు చైర్మన్ లక్ష్మి వర్చువల్‌గా మాట్లాడుతూ.. అట్టడుగు వర్గాల యువతకు వ్యాపారంలో స్ఫూర్తిని నింపి మంచి పారిశ్రామిక వేత్తలుగా తయారు చేస్తామన్నారు.

ఆహ్వానం అందజేత



ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్‌కు ఆహ్వానపత్రికను అందజేస్తున్న దృశ్యం

కాచిగూడ: వీరభద్ర సేవా సమితి ఆధ్వర్యంలో ఈనెల 22న కాచిగూడలోని మున్నూరుకాపు భవన్, మ్యాడం అంజయ్య హాల్‌లో నిర్వహించనున్న శ్రీ వీరభద్రస్వామి కల్యాణ మహోత్సవ వేడుకలకు హాజరు కావాలని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్‌కు మంగళవారం ఆహ్వానపత్రికను సేవా సమితి ప్రతినిధులు అందజేశారు. స్వామివారి కల్యాణ మహోత్సవ వేడుకలను విజయవంతం చేసేందుకు భక్తులకు ఏలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని సేవా సమితి అధ్యక్షుడు షాబాద్ వెంకటేశం, ప్రధాన కార్యదర్శి కాసుల వినోద్ తెలిపారు. కొండూరు వినోద్ కుమార్, ఆనంద్, హరిబాబు, దేవేందర్, మల్లికార్జున్, సాయికిరణ్, విజయ్‌కుమార్, శ్రీకాంత్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌సీ కమిటీని నియమించాలి

కాచిగూడ: రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని కొత్త పీఆర్‌సీ కమిటీని వెంటనే నియమించాలని తెలంగాణ ఎంప్లాయిస్ అసోసియేషన్ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు ఆర్.నవీన్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం నారాయణగూడలోని అసోసియేషన్ కార్యాలయంలో ఆయన అధ్యక్షతన అసోసియేషన్ ప్రతినిధుల సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు మూడు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని సప్లిమెంటరీ బిల్స్ కావట్లేదన్నారు. కనీసం ఉద్యోగి జీపీఎఫ్ పెట్టుకుని 3 నెలలైనా ఎలాంటి స్పందన లేదన్నారు. కనీసం కొత్త పీఆర్‌సీని వేస్తే కొత్త పే స్కేళ్లు అమలులోకి వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

- ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు బహిరంగంగా మద్దతు ప్రకటించినా సమస్యలు సమస్యలుగానే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.
- ప్రధాన ఉద్యోగ సంఘ నాయకులుగా చెప్పుకునే ఉద్యోగ సంఘ నాయకులు వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నామని తక్షణమే పీఆర్‌సీ కమిటీ నియామకంతో పాటు పెండింగ్‌లో ఉన్న 3 డీఏలను వెంటనే అమలు చేయాలన్నారు.



- కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఇస్తున్న సీజీహెచ్‌ఎస్ విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఈహెచ్‌ఎస్ విధానాన్ని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల్లోని అన్ని జిల్లాల్లో అమలయ్యేలా చూడాలన్నారు.
- ఉద్యోగుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిని మానుకోవాలని కోరారు

'బీసీ ముఖ్యమంత్రి కావాలి'

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: రాష్ట్రంలో బీసీలు ముఖ్యమంత్రి కావాలని దీనికి బీసీలంతా ఐక్యంగా ఉద్యామించాలని పూలే అంబేడ్కర్ రాజ్యాధికార సమితి జాతీయ నాయకుడు డాక్టర్ కందుల చందు అన్నారు. మంగళవారం సుందరయ్యవిజ్ఞానకేంద్రంలో పూలే అంబేడ్కర్ రాజ్యాధికార సమితి ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ జనాభాలో 50 శాతం ఉన్న బీసీలు ఓట్లేసే యంత్రాలుగానే ఉన్నారన్నారు. ప్రజలందరూ స్వేచ్ఛగా బ్రతకాలంటే నవ్యసమాజాన్ని సృష్టించాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. పూలే అంబేడ్కర్ రాజ్యాధికార సమితి నేషనల్ కన్వీనర్ డాక్టర్ శివభాగ్యరావు, తెలంగాణ స్టేట్ కో–ఆర్డినేటర్, రవిప్రసాద్, ఏపీ కో–ఆర్డినేటర్ అప్పారావు, నాయకులు నేరెళ్ల కోటేశ్వర్‌రావు, కో–ఆర్డినేటర్ శ్రీనివాస్‌యాదవ్, ప్రజాకవి జయరాజు, పద్మశర్మ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిపై శ్వేతపత్రం విడుదల చేయాలి



చిక్కడపల్లి: గడిచిన పదేళ్లలో కార్పొరేటర్‌గా ఉన్న ముఠా పద్మానరేష్, ఎమ్మెల్యే ముఠాగోపాల్ గాంధీనగర్ డివిజన్‌కు చేసిన అభివృద్ధిపై శ్వేతపత్రం విడుదల చేయాలని బీజేపీ నేతలు డిమాండ్ చేశారు. మంగళవారం గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ కార్యాలయంలో వారు మాట్లాడారు. బీజేపీ కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్‌పై వ్యాఖ్యలు సరికాదన్నారు. బీజేపీ నాయకులు శ్రీకాంత్, మంగమ్మ, డివిజన్ ప్రధాన కార్యదర్శి సురేందర్, ఓబీసీ మోర్చా నాయకులు నవీన్, సాయికుమార్, బీజేవైఎం నాయకులు ఆనంద్‌రావు, అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

అభినందనలు



మౌనికను అభినందిస్తున్న వెంకటాచలం

సుల్తాన్‌బజార్: గుడ్ గవర్నెన్స్ డే సందర్భంగా పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లో జరిగిన యూత్ పార్లమెంట్ సమావేశంలో ప్రసంగించి దేశ ప్రజలందరినీ ఆకట్టుకున్న తెలంగాణ రాష్ట్రానికి చెందిన గిరిపుత్రిక కేతావత్ మౌనిక విద్యాభ్యాసంతో పాటు సివిల్స్ శిక్షణకు అయ్యే ఖర్చును అఖిల భారత బ్యాంకు ఉద్యోగుల సంఘం (ఏఐబీఈఏ) భరిస్తుందని ఏఐబీఈఏ జాతీయ ప్రధాన కార్యదర్శి సీహెచ్.వెంకటాచలం ప్రటించారు. కోఠి, బ్యాంక్ స్ట్రీట్‌లోని ఏపీ, తెలంగాణ బ్యాంకు ఎంప్లాయీస్ ఫెడరేషన్ కార్యాలయంలో మంగళవారం జరిగిన బ్యాంకు ఉద్యోగుల సదస్సులో వెంకటాచలం, ఏఐబీఈఏ జాతీయ కార్యదర్శి బి.ఎస్.రాంబాబు కేతావత్ మౌనికను వేదికపైకి ఆహ్వానించి సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా వెంకటాచలం మాట్లాడుతూ.. గిరిజన అమ్మాయి చిన్న గ్రామం నుంచి పార్లమెంటు సెంట్రల్ హాల్‌లో ప్రసంగించే స్థాయికి ఎదగడం గొప్ప విషయమన్నారు. పేద బాలికల విద్యకు, చదువులో ఉన్న స్థానానికి ఎదగడానికి ఏఐబీఈఏ దేశవ్యాప్తంగా ఆర్థికంగా సహకరిస్తుందని అందులోనే భాగంగా కేతావత్ మౌనికకు విద్యాభ్యాసంతో పాటు సివిల్స్ శిక్షణకు అయ్యే ఖర్చును భరిస్తుందని వెంకటాచలం తెలిపారు.

తప్పిపోయిన ముగ్గురు చిన్నారుల అప్పగింత



పిల్లలను కుటుంబసభ్యులకు అప్పగిస్తున్న పోలీసులు

సంతోష్‌నగర్: తప్పిపోయి రోడ్డుపై తిరుగుతున్న ముగ్గురు చిన్నారులను కంచన్‌బాగ్ పోలీసులు మంగళవారం క్షేమంగా కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఇన్‌స్పెక్టర్ ఆనంద్ కిశోర్ తెలిపిన వివరాల ప్రకారం.. కంచన్‌బాగ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పిసల్‌బండ ప్రాంతంలో మంగళవారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో ముగ్గురు చిన్నారులు హంస్సేన్, ముస్తాఫా, మూసా రోడ్డుపై తిరుగుతున్నారు. దీన్ని గమనించిన స్థానికులు కంచన్‌బాగ్ పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు ముగ్గురు చిన్నారులను అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. అనంతరం పిల్లల ఆచూకీ కోసం వెతకగా రియాసత్‌నగర్, హఫీజ్‌బాబానగర్‌కు చెందిన పిల్లలుగా గుర్తించారు. దీంతో ముగ్గురు పిల్లలను తల్లిదండ్రులకు క్షేమంగా అప్పగించారు.

క్యూబాపై అమెరికా ఆంక్షలను ప్రతిఘటించాలి

సీపీఐ నేత ఈటీ నరసింహ పిలుపు

హిమాయత్‌నగర్: క్యూబాపై అమెరికా ఆంక్షలు, చట్టవిరుద్ధ, అమానవీయ ఆంక్షలను ప్రతి ఒక్కరూ ప్రతిఘటించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఈటీ నరసింహ పిలుపునిచ్చారు. ఈనెల 22న హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో నిర్వహించే క్యూబా సంఘీభావ సభకు ముఖ్యఅతిథులుగా విచ్చేస్తున్న విప్లవ యోధుడు చేగువేరా కూతురు డాక్టర్ అలైద గువేరా, మనుమరాలు ప్రొఫెసర్ ఏస్తిఫీనా గువేరాల స్వాగత కటౌట్లను హిమాయత్‌నగర్ సత్యనారాయణ రెడ్డి భవన్ వద్ద మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఈటీ నరసింహ మాట్లాడుతూ.. అమెరికా క్యూబాకు వ్యతిరేకంగా ప్రచారాలు చేయడం, అంతర్గత విధ్వంసం సృష్టించడం దారుణమన్నారు. సామ్రాజ్యవాద వ్యతిరేక శక్తులను సమర్థవంతంగా ఎదుర్కొంటూ భవిష్యత్ తరాలకు సోషలిస్ట్ వారసత్వాన్ని అందించేందుకు కృషి చేస్తున్న క్యూబాను అభినందించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు వీఎస్ బోస్, ఏఐటీయూసీ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. బాలరాజ్, సీపీఐ హైదరాబాద్ జిల్లా సహాయ కార్యదర్శులు ఎస్. ఛాయాదేవి, బి.స్టాలిన్, జిల్లా కార్యవర్గ సభ్యులు నిర్లేకంటి శ్రీకాంత్, నేతలు బొడ్డుపల్లి కిషన్, కంపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.



అలైద గువేరా, ఏస్తిఫీనాల కటౌట్‌లను ఆవిష్కరిస్తున్న ఈటీ నరసింహ తదితరులు

నేడు లా డిగ్రీ, పీజీ కోర్సుల్లో స్పాట్ అడ్మిషన్లు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలోని బషీర్‌బాగ్ పీజీ లా కాలేజీలో 5 సం.ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం కోర్సుల్లో ప్రవేశాలకు నేడు (18న) కళాశాల ఆవరణలో స్పాట్ అడ్మిషన్లు జరగనున్నాయి. బుధవారం ఎల్ఎల్‌బీ కోర్సుకు ఉదయం 10.30 లకు, ఎల్ఎల్ఎం కోర్సుకు సాయంత్రం 5 గంటలకు హాజరు కావాలని అధికారులు తెలిపారు.